క్లుప్తంగా

బెల్ట్‌షాప్ తనిఖీ



అమరచింత: మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాప్‌పై దాడి చేసి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు. నాగల్‌కడ్మూర్‌లో అక్రమంగా బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నారనే సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి ఆకస్మికంగా దాడి నిర్వహించి 40 క్వార్టర్ సీసాలు, 12 బీర్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. బెల్ట్ షాప్ నిర్వాహకుడు గోవర్ధన్‌రెడ్డిపై కేసు నమోదు చేశామని తెలిపారు. మండలంలో ఎవరైన అక్రమంగా బెల్ట్‌షాప్‌లు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని నాగరాలకు చెందిన గొల్ల రాజు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా.. ఈ విషయాన్ని నాగరాల సర్పంచ్ నిర్మలరాధకృష్ణ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి రూ.2 లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేశారు. ఎల్‌ఓసీ కాపీని బుధవారం హైదారాబాద్‌లోని మంత్రుల సముదాయంలో బాధితుడికి అందజేశారు.

ఆర్థికసాయం



పెబ్బేరు రూరల్: మండలంలోని సూగూర్‌కు చెందిన కుమ్మరి బాలాజీ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు వనపర్తి నియోజకవర్గ నాయకుడు, పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మేఘారెడ్డి పంపిన రూ.10 వేలను బుధవారం నాయకులు బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో నరసింహ నాయుడు, రామలక్ష్మణ్, శేఖర్, రాముడు, అక్కన్న, వెంకటేష్, బోయ బాలయ్య, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

క్విట్ ఇండియా ఉద్యమకారులకు సన్మానం



పెబ్బేరు రూరల్: క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను సన్మానించుకోవడం మన బాధ్యత అని వనపర్తి ఆర్డీఓ పద్మావతి అన్నారు. ఆగస్టు 9న క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం క్విట్ ఇండియా ఉద్యంలో పాల్గొన్న ఉద్యమకారులను, వారి కుటుంబ సభ్యులకు సన్మానించేందుకు శ్రీకారం చుట్టింది. బుధవారం వనపర్తి మండలంలోని కడుకుంట్ల గ్రామానికి చెందిన క్విట్ ఇండియా ఉద్యమకారుడు బలరాం భార్య సీతమ్మను ఆర్డీఓ పద్మావతి సన్మానించారు. సీతమ్మ మాట్లాడుతూ తన భర్త బలరాం ఉద్యమంలో పాల్గొన్న ఆనాటి ఘటనలు గుర్తుకు తెచ్చుకున్నారు.

సారా బట్టీలపై ఎక్సైజ్ పోలీసుల దాడులు



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని అనకాయపల్లితండా, గౌరాయికుంటతండా, పిల్లికుంటతండా శివారుల్లో కొంతకాలంగా గుట్టు చప్పుడు కాకుండా సారా తయారు చేస్తున్నారనే సమాచారంతో ఎక్సైజ్ ఎస్‌ఐ సుధాకర్ రెడ్డి సిబ్బందితో కలిసి సారా బట్టీలపై దాడులు చేశారు. ఈ దాడుల్లో 80లీటర్ల పానకం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. తండాల్లో సారా తయారీ చేసినట్టు తెలిస్తే దాడులు నిర్వహించి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రభుత్వ బడుల్లోనే మెరుగైన విద్య

పాన్‌గల్: పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ బడుల్లోనే చదివించి, వాటి బలోపేతానికి తోడ్పాటునందించాలని దావాజిపల్లి సర్పంచ్ వెంకటయ్యయాదవ్ అన్నారు. బుధవారం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్, వర్క్‌బుక్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా భోజనం, పుస్తకాలు, నోట్‌బుక్స్ ఉచితంగా అందజేస్తూ నాణ్యమైన విద్యను అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బద్రూనాయక్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

‘గృహలక్ష్మి’తో పేదలకు మేలు



ఆత్మకూర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న చైర్‌పర్సన్ గాయత్రి

వనపర్తి టౌన్: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు బుధవారం మున్సిపల్ కార్యాలయానికి పోటెత్తారు. దీంతో అధికారులు రెండు కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఈ మేరకు 337 మంది దరఖాస్తు చేసుకున్నారని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ విక్రమసింహారెడ్డి మాట్లాడుతూ సొంత స్థలం ఉండి ఇళ్లు లేని పేదలు ప్రభుత్వం అందించే రూ. 3లక్షలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పుర అధికారులు మల్లేష్, బురాన్, మోహన్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: మున్సిపల్ కార్యాలయంలో గృహలక్ష్మి పథకానికి సంబంధించి దరఖాస్తులను స్వీకరించడానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా తెలిపారు. బుధవారం పట్టణంలోని ఆయా వార్డుల ద్వారా 160 దరఖాస్తులు వచ్చాయన్నారు. అదే విధంగా ఎంపీడీఓ కార్యాలయంలో 190 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీఓ నరసింహులు తెలిపారు.

పాన్‌గల్: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు బుధవారం మండల కేంద్రంలోని మీ సేవా కేంద్రాల వద్ద ప్రజలు గుమిగూడారు. దరఖాస్తు చేసుకునేందుకు కేవలం ఒక్కరోజు మాత్రమే సమయం ఉండటంతో కులం, ఆదాయం ధ్రువపత్రాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు మీ సేవా కేంద్రాల వద్ద పడిగాపులు పడుతున్నారు. కానీ విద్యుత్, సర్వర్ డౌన్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దరఖాస్తు చేసుకునేందుకు గడువును పొడగించాలని వారు కోరుతున్నారు. ఇప్పటి వరకు 780 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు.

వీపనగండ్లలో..

గృహలక్ష్మీ పథకం ద్వారా దరఖాస్తు చేసుకునే గడువు పెంచాలని బుధవారం వీపనగండ్ల ఎంపీడీఓ కార్యాలయం ఎదుట తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కొద్ది రోజులే దరఖాస్తు గడువు పెట్టడంతో అర్హులైన వారు దరఖాస్తు చేసుకోలేరని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి గడువును పెంచాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి ఆంజనేయులు డిమాండ్ చేశారు. దరఖాస్తు పెంచకుంటే ఆందోళన కార్యక్రమాన్ని ఉధృతం చేస్తామని వారు అన్నారు.

గోపాల్‌పేట: గృహలక్ష్మి పథకం దరఖాస్తు చేసుకునేందుకు గురువారంతో గడువు ముగుస్తుండటంతో బుధవారం మండల కేంద్రంలోని మీసేవా కేంద్రాలు, మండల కార్యాలయం వద్ద జనాలు గుమిగూడారు. గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం మరింత సమయం ఇవ్వాలని పలువురు కోరారు.

ఖిల్లాఘనపురం: ప్రభుత్వం గృహలక్ష్మి పథకం దరఖాస్తు గడువును పెంచాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల బీజేపీ ఆధ్వర్యంలో వారు విలేకర్లతో మాట్లాడుతూ పేదలకు పక్కా ఇళ్లు నిర్మిస్తామని చెబుతున్న ప్రభుత్వం దరఖాస్తుకు మాత్రం కేవలం మూడు రోజులు గడువు ఇవ్వడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఆశన్న, కొండల్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

510 దరఖాస్తులు

గృహలక్ష్మి పథకానికి బుధవారం మండలంలో 510 మంది దరఖాస్తు చేసుకున్నారు. మంగళవారం పథకం గురించి పెద్ద గా ప్రచారం కాకపోవడంతో కేవలం 54 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. మొత్తం రెండు రోజులకు 564 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీఓ విజయ్‌కుమార్ తెలిపారు.

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలో గృహలక్ష్మి పథకానికి 832 మంది దరఖాస్తు చేసుకున్నారని ఎంపీడీఓ సుదర్శన్ తెలిపారు. శ్రీరంగాపురం మండలంలో 295 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీఓ ప్రసన్నకుమారి తెలిపారు.

దరఖాస్తు గడువు పెంచాలి

గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు గడువు పెంచాలని బీఎస్పీ నాయకులు బుధవారం తహసీల్దార్‌కు మురళిగౌడ్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో బహుజన రమేష్, ఎంపీటీసీ ఎల్లస్వామి, వార్డు సభ్యుడు చంద్రశేఖర్, రాములు పాల్గొన్నారు.

ఆత్మకూర్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 435, పురపాలిక కార్యాలయంలో 178 కలిపి మొత్తం 613 దరకాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, కమిషనర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



అమరచింతలో..



శ్రీరంగాపురంలో..



వనపర్తిలో..



గోపాల్‌పేట మండల కేంద్రంలో..

మహిళ అదృశ్యం: కేసు నమోదు

వనపర్తి: రెండు రోజుల క్రితం నుంచి తన భార్య కనిపించడం లేదని పట్టణంలోని పీర్లగుట్ట ప్రాంతానికి చెందిన ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ యుగంధర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఇంటి నుంచి వెళ్లిన తన భార్య మహేశ్వరి ఇప్పటి వరకు తిరిగి రాలేదని బుధవారం బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దాడి ఘటనపై..

పాన్‌గల్: పొలం పంచాయతీ విషయంలో గొడవపడి ఒకరిపై దాడి చేసిన ఘటనపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వేణు తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన పెద్దబోది సత్యం పొలంలో సాగు నీరు ఎక్కువై కాల్వలోకి పోతుందని, పెద్దబోది నాగరాజు సాగునీరు పారకుండా అడ్డంగా మట్టి పోశారు. మట్టి పోసిన విషయంపై సత్యం నాగరాజును ప్రశ్నించారు. దీంతోమాటమాట పెరిగి సత్యంపై నాగరాజు దాడిచేసి గాయపర్చారని తెలిపారు. బాధితుడి కుమారుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాగరాజుపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

వనపర్తి: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ గాయాలపాలైన ఘటన బుధవారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తకోట రోడ్డులో మోటార్ సైకిల్‌పై వస్తున్న ఓ జంట అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ఘటనలో పద్మకు స్వల్ప గాయాలయ్యాయి. ఆమెను 108 అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

దుంపాయికుంట లబ్ధిదారుల ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న లబ్ధిదారులు

అమరచింత: పట్టణంలోని దుంపాయికుంటలో గుడిసెలు వేసుకొని నివసిస్తున్న లబ్ధిదారులను గృహలక్ష్మి పథకం ద్వారా ఆదుకోవాలని, వారికి పట్టాలు ఇచ్చి అర్హులుగా ఎంపిక చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ మాట్లాడుతూ 22ఏళ్ల కింద ఇంటి నిర్మాణం కోసం పట్టాలను ఇచ్చిన అధికారులు ఇప్పటికీ స్థలాలను చూపకపోవడం ఏమిటని ప్రశ్నించారు. తమ స్థలాలను తమకు చూపాలంటూ గతేడాది సెప్టెంబర్ 6 నుంచి లబ్ధిదారులు దుంపాయికుంటలో గుడిసెలు నిర్మించుకున్నారు. ఇప్పటి వరకు ఎమ్మెల్యే, కలెక్టర్ వారికి స్పష్టమైన హామీ ఇవ్వలేకపోవడం వింతగా ఉందన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాలు అనంతమ్మ, వసంత, శ్రీనివాసులు, కిరణ్, శారదమ్మ, రేష్మ, మాణిక్యమ్మ, శాంత, మంజుల పాల్గొన్నారు.

కాంగ్రెస్ రాజ్య స్థాపనే లక్ష్యం



కొత్తకోటలో జాతీయ జెండా ఎగరవేసిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్‌గౌడ్

కొత్తకోట: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు యూత్ కాంగ్రెస్ కీలకంగా వ్యవహరించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 'క్విట్ ఇండియా డే' పురస్కరించుకుని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రదీప్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ రెండు దఫాలుగా మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్‌ను గద్దె దించేందు యూత్ కాంగ్రెస్ నిరంతరం శ్రమించాలన్నారు. కార్యక్రమంలో నరోత్తంరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, రాఘవేందర్‌గౌడ్, మహేష్, మోమన్‌నాయక్, ప్రవీణ్‌కుమార్, శివ తదితరులు ఉన్నారు.

అమరచింత: కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ స్థాపన కోసం యువజన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్నామని నియోజక వర్గ కాంగ్రెస్ యూత్ కన్వీనర్ గద్దం శ్రీకాంత్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ కార్యాలయం ఎదుట జాతీయ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి, శ్యాం, జానకీరాముడు, హనుమంత్ నాయక్, బద్రినాయక్, సుధాకర్, లక్ష్మన్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలి

వనపర్తి: దళిత సర్పంచ్‌పై దాడి చేసిన కోడేరు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి మాదిగ డిమాండ్ చేశారు. బుధవారం వీపనగండ్ల మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోజురోజుకూ బలహీలన వర్గాలపై దాడులు అధికమవుతున్నాయని, చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వాపోయారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 16న కొల్లాపూర్ పట్టణంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని, ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో దళితులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ మీసాల నాగరాజు, కుర్మయ్య, రాములు, వెంకటస్వామి పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పాన్‌గల్: మండలంలోని మాందాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. దృష్టి లోపం, బలహీనంగా ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి అవసరమైన మందులను అందించినట్లు వైద్యులు డాక్టర్లు హరీష్, లావణ్య పేర్కొన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కళ్ల కలక లాంటి జబ్బులకు భయపడకుండా వైద్యం చేయించుకోవాలని, సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు పాటించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీరాములు, ఫార్మసిస్ట్ స్వప్న, ఏఎన్‌ఎం ఉమ పాల్గొన్నారు.

గిరిజనులకు అన్యాయం



అమరచింత: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన, ఆదివాసీల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయని టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్ అన్నారు. ప్రపంచ ఆదివాసీల దినోత్సవాన్ని పురస్కరించుకొని టీపీసీసీ పిలుపు మేరకు మండలంలోని చంద్రనాయక్‌తండాలో బుధవారం రాత్రి తండా నిద్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడి గిరిజనులతో సమావేశం నిర్వహించి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆదివాసీలు, గిరిజనుల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో నారాయణ పేట జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి, అయూబ్‌ఖాన్, మహేందర్‌రెడ్డి, అరుణ్ కుమార్, తౌఫిక్, పోసిరిగారి విష్ణు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెబ్బేరు రూరల్: ఇంట్లో ఉరేసుకున్న వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన బుధవారం మండలంలోని పెద్దగూడెంతండాలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నాగన్న కథనం మేరకు.. వనపర్తి మండలంలోని పెద్దగూడెంతండాకు చెందిన నేనావత్ రమేష్ (35) ఈ నెల 6న మద్యం తాగి ఇంటికి రావడంతో భార్య నేనావత్ శాంత మందలించింది. మత్తులో ఉన్న అతడు గదిలోకి వెళ్లి ఇంటి పైకప్పునకు ఉరేసుకున్నాడు. కాసేపటికి భార్య తలుపులు తెరచి చూడగా.. వేలాడుతూ కనిపించడంతో గట్టిగా అరిచింది. అతడి అన్న వచ్చి కిందకి దింపి వెంటనే వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

45వ రోజుకు చేరిన స్వీపర్ల సమ్మె

పెబ్బేరు రూరల్: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని స్వీపర్లు చేపట్టిన సమ్మె బుధవారం నాటికి 45వ రోజుకు చేరింది. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు శోభారాణి, ఖాజపాషా, రషీద్, ఖయ్యాం, బాలస్వామి, కురుమన్న, గీత, నాగమ్మ, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన

పాన్‌గల్: మండలంలోని చిక్కేపల్లి సమీపంలో నిర్మిస్తున్న బ్రిడ్జి పూర్తయితే ఇబ్బందులు తొలుగుతాయని ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం సర్పంచ్ బాలస్వామియాదవ్‌తో కలిసి ఆయన బ్రిడ్జి నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో రూ.3 కోట్లు మంజూరు చేయడంతో బ్రిడ్జి నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని 27వ వార్డు సాయి నగర్ కాలనీ రామాలయం పక్కన నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం ఏఈ తులసి ప్రారంభించారు. లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని వార్డు కౌన్సిలర్ లక్ష్మీదేవి ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన వారు నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు, కౌన్సిలర్ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సబ్ ఇంజినీర్ కిరణ్, లైన్‌మెన్ గఫార్, రాఘవేందర్, ఎల్‌ఐసీ వీరాచారి, కాంట్రాక్టర్ సంపత్, రంజీత్, శివగౌడ్ పాల్గొన్నారు.

పాయింట్ల పద్ధతి ఉపసంహరించుకోవాలి

గోపాల్‌పేట: ఉపాధ్యాయ బదిలీల్లో స్పౌజ్‌లకు ప్రత్యేకంగా ఇస్తున్న పది పాయింట్ల పద్ధతిని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఏడుట్ల నాన్ స్పౌజ్ ఉపాధ్యాయులు బుధవారం విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌రావు, కుర్మయ్య, సాయిబాబు, శ్రీనివాసులు, భాస్కర్, రవికుమార్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ పోరాటంలో భాగస్వాములవ్వాలి

కొత్తకోట: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని చేస్తున్న పోరాటంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) జిల్లా కన్వీనర్ గణేష్‌మాదిగ అన్నారు. బుధవారం కొత్తకోటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేస్తామని ప్రభుత్వాలు ప్రగల్భాలు పలుకుతున్నా చేతల్లో మాత్రం చిత్తశుద్ధి చూపడం లేదని ఎద్దేవా చేశారు. మాదిగలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న బీజేపీకి సరైన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో జ్యోతి, మహేష్, మాధవి, జాను, అశోక్, శేఖర్, దీక్షణ, ఆకాష్, మౌనిక, మోహన్, నరేష్, శ్రావణి ఉన్నారు.

ఘనంగా ఉత్సవాలు



ప్రార్థనలు చేస్తున్న ఎంపీపీ, చైర్‌పర్సన్, భక్తులు

ఆత్మకూర్: రెండు రోజులుగా పట్టణంలో జరుగుతున్న హజ్రత్ సయ్యద్‌షా సాహెబ్ రహ్మతుల్లాఅలై, హజ్రత్ సయ్యద్ మౌలాన సాహెబ్ రహ్మతుల్లాఅలై ఉర్సు బుధవారం ఘనంగా ముగిశాయి. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రముఖ గాయకులు హాశం, గఫూర్, అమర్ మాస్టర్ ఆధ్వర్యంలో ఖవ్వాలీ కార్యక్రమాలు ఉత్సాహంగా కొనసాగాయి. సాయంత్రం జమేదార్ వీధి యువకులు గలీఫ్, చాదర్‌ను పురవీధుల గుండా ఊరేగించి దర్గాకు చేర్చారు.

పీఠాధిపతులు, ప్రముఖుల ప్రార్థనలు

ఉర్సుకు వట్టెం షరీఫ్ పీఠాధిపతి ముర్షద్ ఖాజబాబా వఖలందరి ఛిస్తీమీర్జాయి సాహెబ్ ముఖ్య అతిథులుగా మాజరై ఫాతేహా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ బంగారుశ్రీను, మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయ భాస్కర్‌రెడ్డి, రవియాదవ్, వైస్‌ఎంపీపీ కోటేష్, కౌన్సిలర్ మండ్లరామకృష్ణ, నిర్వాహకులు ఎక్బాల్ బిన్ సయ్యద్, ఖమర్‌బిన్ సయ్యద్, బారిసాబ్, గయాసుద్దీన్, ఖలీల్, మినాజ్, మగ్బూల్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



విద్యార్థులను అభినందిస్తున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

పెబ్బేరు రూరల్: పట్టణ కేంద్రంలోని ఎస్‌జీఎఫ్ మండల స్థాయి అండర్ 14, 17 క్రీడల్లో బుధవారం మాంటిస్సోరి విద్యార్థులు ప్రతిభ కనబర్చారని ఉపాధాయ బృందం తెలిపారు. బాలుర అండర్-17 ఖోఖో మొదటి బహుమతి, కబడ్డీలో రెండో బహుమతి మాంటిస్సోరి ప్లే వే స్కూల్‌కు చెందిన విద్యార్థులు గెలిచారు. నందిని, గౌస్య, ప్రణీత్, రిషిక జిల్లా స్థాయి అండర్-17 బాలికల ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. అలాగే ప్రణవ్‌సాయి, అక్షయ, అరవింద్, హేమంత్, ఓంకార్ అండర్-17 బాలుర ఖోఖోకు, నవీన్, అరవింద్, సంతోష్, రాజు అండర్-17 బాలుర కబడ్డీ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రెస్వామి, నాయకులు కృష్ణకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేయాలి

వనపర్తి: వీపనగండ్ల మండలంలోని గోపల్‌దిన్నెకు చెందిన స్వాతి ఇటీవల ప్రకటించిన ఎస్‌ఐ ఫలితాల్లో 15వ ర్యాంకు పొంది ఎస్‌ఐగా ఎంపిక కావడంతో బుధవారం గ్రామంలోని ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల నాయకులు ఘనంగా సన్మానించారు. తండ్రి కుమ్మరి భాస్కర్ చనిపోయినా తల్లి వెంకటమ్మ కూలీ పనులు చేసి స్వాతిని చదివించిందని, తల్లి కష్టాన్ని గుర్తించిన స్వాతి అహర్నిశలు కష్టపడి చదివి ఎస్‌ఐ ఉద్యోగం సాధించిందని సింగిల్ విండో మాజీ చైర్మన్ బాల్‌రెడ్డి, సర్పంచ్ విజయ్‌కుమార్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి అన్నారు. స్వాతిని ఆదర్శంగా తీసుకుని గ్రామంలో యువత కష్టపడి చదవాలని సూచించారు. కార్యక్రమంలో వీపనగండ్ల సర్పంచ్ నర్సింహారెడ్డి, కుర్మయ్య, ఆంజనేయులు, లక్ష్మి, శేఖర్‌రెడ్డి, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని కిష్టారెడ్డిపేటలో నిరుపేద కుటుంబానికి చెందిన బుడగ జంగాల కిరణ్‌కుమార్ ఎస్‌ఐగా ఉద్యోగం సాధించడంతో బుధవారం వివిధ పార్టీల నాయకులు సన్మానించారు. బుడగ జంగాల ఎల్లమర్తి తిరుపతమ్మ, బుచ్చన్న హోటల్‌లో కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని ముగ్గురు పిల్లలను చదివించారు. వారి పెద్ద కుమారుడు కిరణ్ సివిల్ ఎస్‌ఐగా ఎంపిక కావడంతో వారిని అభినందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విధుల్లో నిబద్ధతతో పనిచేస్తూ తల్లిదండ్రులు గర్వపడే స్థాయికి రావాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు వంగూర్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి, దిలీప్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాములు, సర్వేష్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం సరికాదు

పాన్‌గల్: గ్రామాల్లో సామాజిక తనిఖీ త్వరలో ప్రారంభించనున్న నేపథ్యంలో వీటికి సంబంధించిన అన్ని రికార్డులను సిద్ధంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందికి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీఓ రఘురాములు, ఏపీఓ కుర్మయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచాలి

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఎల్‌ఎఫ్‌ఎన్‌పై వారం రోజుల పాటు ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు వారం రోజుల పాటు తెలుగు, గణితం, ఇంగ్లిష్ సబ్జెక్టులపై ఉపాధ్యాయులు నేర్చుకున్న ప్రతి అంశాన్ని పాఠశాలల్లో పాటిస్తూ విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం మద్దిలేటి, ఆర్పీలు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: ఉమ్మడి పెబ్బేరు, శ్రీరంగాపూర్ మండలాల ఉపాధ్యాయులకు పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. కార్యక్రమంలో ఎంఈఓ జయరాములు, నోడల్ ఆఫీసర్ వరలక్ష్మి, ఆర్పీలు శివశంకర్ యాదవ్, చంద్రశేఖర్, చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.